క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో మైసమ్మకు పూజలు



మైసమ్మకు పూజలు నిర్వహిస్తున్న భక్తులు

కడ్తాల్: మండల పరిధిలోని మైసిగండి మైసమ్మ జాతర ఉత్సవాలు భక్త జన సందోహం మధ్య వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా ఐదో రోజు శుక్రవారం మైసమ్మకు ప్రత్యేక పూజలు, అర్చనలు, మహాలింగార్చన, పుష్పార్చన తదితర కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో మైసమ్మ దేవతను దర్శించుకుని పూజలు చేశారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ఆలయ నిర్వాహకులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో స్నేహలత, శిరోలీ తదితరులు ఉన్నారు.

విదేశీ చట్టాలపై అవగాహన

అక్షరలో అంతర్జాతీయ వేడుకలు



నృత్యం చేస్తున్న చిన్నారులు

బడంగ్‌పేట్: విద్యార్థులకు విదేశీ చట్టాలు, ఆచార వ్యవహారాలపై అవగాహన కల్పించేందుకు నాదర్‌గుల్ అక్షర స్కూల్‌లో 'అంతర్జాతీయ దినోత్సవం' పేరిట శుక్రవారం వేడుకలు నిర్వహించారు. పాఠశాల సీఈఓ మదన్‌మోహన్‌రావు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఇండియా, ఆస్ట్రేలియా, చైనా, అమెరికా, ఫ్రాన్స్, ఇటలీ, జపాన్, యూఏఈ, ఈజిప్ట్ దేశాలకు సంబంధించిన సంస్కృతి, సాంప్రదాయాలు, వేషధారణ, చారిత్రక కట్టడాలు, ఆహార పదార్థాలు ప్రదర్శించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. సీఈఓ మదన్‌మోహన్‌రావు మాట్లాడుతూ.. భవిష్యత్తులో విదేశాల్లో స్థిరపడే విద్యార్థుల కోసం ఈ వేడుకను నిర్వహిస్తున్నామన్నారు. పాసుపోర్ట్ వెరిఫికేషన్, చెకింగ్ ఎంబసీలు, పరాయి దేశాలకు మన దేశానికి ఉన్న కాలమాన వ్యత్యాసాలు, ఆయా దేశాల్లో ఉన్న నియమాలు, చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సాంస్కృతిక ప్రదర్శన ఆకట్టుకుంది. ప్రిన్సిపాల్ హర్ష సోలంకి, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

కంచెలేని ట్రాన్స్‌ఫార్మర్లు

మొయినాబాద్: కంచెలేని ట్రాన్స్‌ఫార్మర్లతో ప్రమాదాలు పొంచి ఉన్నాయి. రోడ్ల పక్కన ఇళ్ల మధ్య ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ల వల్ల అనేక ప్రమాదాలు జరుగుతున్నాయి. ఎలాంటి రక్షణ కంచె లేకపోవడంతో కరెంట్ షాక్‌కు గురై మనుషులు, పశువులు చనిపోయాయి. మండల పరిధిలోని నాగిరెడ్డిగూడ, చిలుకూరు, పెద్ద మంగళారం, చిన్నమంగళారం, రెడ్డిపల్లి, సురంగల్, కేతిరెడ్డిపల్లి తదితర గ్రామాల్లో విద్యుత్ ప్రమాదాల వలన ఆవులు, గేదెలు, మేకలు చనిపోయాయి. ఎత్‌బార్‌పల్లి, నాగిరెడ్డిగూడ, సజ్జన్‌పల్లి గ్రామాల్లో పలువురు ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద కరెంటు షాక్ తగిలి మరణించారు. అలాగే మండలంలోని పలు గ్రామాల్లో ఇనుప స్తంభాలు ప్రమాదకరంగా ఉన్నాయి. ఒరిగిన స్తంభాలు, వేలాడుతున్న విద్యుత్ తీగలతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. విద్యుత్ అధికారులు స్పందించి ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.



విజయనగర్ కాలనీలో రోడ్డు పక్కన ప్రమాదకరంగా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్

'గులాబీ'లో గుబులు

- బీఆర్ఎస్ అభ్యర్థుల్లో ఫార్మా టెన్షన్
- భూ బాధితులు ఎవరికి ఓటేశారోనని ఆందోళన
- మూడు నియోజకవర్గాల్లో ప్రభావం చూపనున్న ఓటర్లు
- అభివృద్ధిపైనే ఆశలు పెట్టుకున్న అధికారపార్టీ అభ్యర్థులు
- కాంగ్రెస్ ప్రయత్నాలు ఫలించేనా..?



నక్కర్తమేడిపల్లి గ్రామంలో సేకరించిన భూమిలో పాతిన ఫార్మాసిటీ బోర్డు



శ్రీశైలం హైవే నుంచి మీరాఖాన్‌పేట్ మధ్యన ఫార్మాసిటీ రోడ్డు

యాచారం: అధికార బీఆర్ఎస్ అభ్యర్థులకు ఫార్మాసిటీ గుబులు పట్టుకుంది. బాధిత గ్రామాల్లోని ఓటర్లు ఎటు వైపు ఓటేశారోనని ఆందోళన చెందుతున్నారు. కేసీఆర్ సర్కార్ రంగారెడ్డి జిల్లాలోని ఇబ్రహీంపట్నం, మహేశ్వరం, కల్వకుర్తి నియోజకవర్గాల సరిహద్దులోని 19,333 ఎకరాల్లో హైదరాబాద్ గ్రీన్ ఫార్మాసిటీని ఏర్పాటు చేస్తున్న విషయం తెలిసిందే. మూడు నియోజకవర్గాల్లో 10 వేల ఎకరాలకు పైగా అసైన్డ్, పట్టా భూములను ఫార్మాసిటీకి సేకరించారు. భూములిచ్చిన అసైన్డ్ రైతులకు ఎకరాకు రూ.8 లక్షలు, పట్టా రైతులకు రూ.16 లక్షల చొప్పున పరిహారం చెల్లించారు. సేకరించిన భూముల్లో గుట్టలు, రాళ్లు, రప్పలు చదును చేసి రోడ్లు కూడ వేశారు. అసైన్డ్ రైతులు ఎలాంటి షరతులు విధించకుండా తమ భూములను ఇచ్చారు. కానీ పట్టా రైతులు మాత్రం అభ్యంతరం వ్యక్తం చేశారు. ఫార్మాకు భూములివ్వమని మొదటి నుంచి చెబుతున్నారు. భూములివ్వని రైతుల భూ రికార్డులను ధరణి పోర్టల్‌లో సమాచారం లేకుండానే టీఎస్ఐఐసీ పేరు మీద మార్చేశారు. అప్పటి నుంచి రైతులకు రైతుబంధు, రైతుబీమా, బ్యాంకు రుణాలు, అత్యవసర పరిస్థితుల్లో భూములను విక్రయించడానికి అవకాశం లేకుండా పోయింది. దీంతో బాధితులు అధికార పార్టీపై గుర్రుగా ఉన్నారు.

కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోను నమ్మినట్లేనా..?

అధికారంలోకి వస్తే ఫార్మాసిటీని రద్దు చేస్తామని, న్యాయస్థానాల తీర్పు ప్రకారం తిరిగి ఆ రైతులకే భూములు ఇస్తామని కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన మేనిఫెస్టోలో స్పష్టం చేసింది. ఇబ్రహీంపట్నం నియోజకవవర్గం యాచారం మండల పరిధిలోని నక్కర్తమేడిపల్లి, నానక్‌నగర్, తాడిపర్తి, కుర్మిద్ద, మహేశ్వరం నియోజకవవర్గంలో కందుకూరు మండల పరిధిలోని ముచ్చర్ల, సాయిరెడ్డిగూడ, మీరాఖాన్‌పేట్, పంజాగూడ, ఆకులామైలారం, కల్వకుర్తి నియోజకవర్గం కడ్తాల్ మండల పరిధిలోని ముద్విన్, కర్కల్‌పహాడ్, పల్లెచల్కతండాల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. యాచారం మండల పరిధిలోని నాలుగు గ్రామాల్లో 9,500 ఓట్లు, కందుకూరు మండల పరిధిలోని ఐదు గ్రామాల్లో 12 వేలు, కడ్తాల్ మండల పరిధిలోని 6 వేల ఓట్లు ఉన్నాయి. మహేశ్వరం, కల్వకుర్తి నియోజకవర్గాల్లో బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీ మధ్య ముక్కోణపు పోటీ నెలకొంది. ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలో మాత్రం బీఆర్ఎస్, కాంగ్రెస్ అభ్యర్థులు నువ్వా.. నేనా అన్నట్లు తలపడ్డారు. కల్వకుర్తి నియోజకవర్గ బీజేపీ అభ్యర్థి ఆచారి చాలాకాలంగా ఫార్మాసిటీకి వ్యతిరేకంగా పోరాటం చేస్తున్నారు. ఇబ్రహీంపట్నం, మహేశ్వరం నియోజకవర్గాల్లో కాంగ్రెస్ అభ్యర్థులు మల్‌రెడ్డి రంగారెడ్డి, కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి పార్టీ ప్రకటించిన మేనిఫెస్టోను ప్రజల్లోకి తీసుకెళ్లి.. ఓటర్లను తమ వైపు తిప్పుకునేందుకు యత్నించారు. వీరిని ఆ గ్రామాల రైతులు నమ్మినట్టయితే హస్తం గుర్తుకు భారీగా ఓట్లు పడే అవకాశం లేకపోలేదు.

అభివృద్ధిపైనే ఆశలు

బీఆర్ఎస్ సర్కార్ ఫార్మాసిటీ ఏర్పాటును ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. మహేశ్వరం నియోజవర్గ పరిధిలోని శ్రీశైలం హైవే కందుకూరు గేట్ నుంచి మీరాఖాన్‌పేట వరకు వంద అడుగుల రోడ్డును విస్తరించింది. ఇబ్రహీంపట్నం నియోజకవర్గ పరిధిలోని యాచారం మండల కేంద్రం సాగర్ హైవే నుంచి రూ.70 కోట్ల నిధులతో మీరాఖాన్‌పేట వరకు రోడ్డును విస్తరించాలని నిర్ణయం తీసుకుంది. అయితే కొన్ని కారణాల వల్ల రోడ్డు పనుల్లో జాప్యం జరిగింది. వ్యతిరేకతను తగ్గించేందుకు, భూములు కోల్పోయిన రైతులకు మీరాఖాన్‌పేట సమీపంలో 600 ఎకరాల్లో అన్ని సౌకర్యాలతో హెచ్ఎండీఏ వెంచర్‌లో 121 గజాల చొప్పున ప్లాట్లు కేటాయించారు. ఇప్పటికే రైతు కుటుంబాలకు పట్టాలు కూడా అందజేశారు. మంచిరెడ్డి కిషన్‌రెడ్డి యాచారం మండల పరిధిలోని నాలుగు గ్రామాల్లో టీఎస్ఐఐసీ నుంచి రూ. 10 కోట్లకు నిధులతో సీసీ రోడ్లు వేయించారు. ఎన్నికల ప్రచారంలో ప్రజా వ్యతిరేకతను పసిగట్టిన అధికార పార్టీ అభ్యర్థులు ఆయా గ్రామాల్లో ప్రజలకు దగ్గరయ్యేందుకు యత్నించారు. అభివృద్ధి చూసి కారు గుర్తుకు ఓటు వేస్తారని భావించారు. అయితే ఈ ఉత్కంఠకు 3వ తేదీన తెరపడనుంది.

మల్‌రెడ్డి విజయం కోసం..



శివాలయంలో పూజలు చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

మంచాల: ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యేగా మల్‌రెడ్డి రంగారెడ్డి గెలుపొందాలని కాంగ్రెస్ పార్టీ నాయకులు శుక్రవారం రాచకొండ గుట్టలోని శివాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అదే విధంగా హజరత్ గాలిబ్ దర్గాలో ప్రార్థనలు కూడా చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మూడు పర్యాయాలు ఓడిపోయినా.. భయపడకుండా ప్రజల కోసం రంగారెడ్డి పనిచేశారని కొనియాడారు. జనాలు కూడా అదే స్థాయిలో ఆయనను ఆదరించారని పేర్కొన్నారు. అలాగే పార్టీ బలోపేతానికి నిరంతరం కృషి చేశారని గుర్తుచేశారు. అన్ని సర్వేలు పార్టీకి అనుకూలంగా వచ్చాయని పేర్కొన్నారు. ఇబ్రహీంపట్నం గడ్డపై కాంగ్రెస్ జెండా ఎగురవేస్తామని, రాష్ట్రవ్యాప్తంగా అధిక స్థానాలు దక్కించుకుని ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తామని ధీమా వ్యక్తంచేశారు. అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లో ఆరు గ్యారంటీ పథకాలను అమలు చేస్తామని ప్రకటించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు మాదగోని జంగయ్య గౌడ్, అంతటి రాజుగౌడ్, చెరుకు నర్సింహగౌడ్, మెగావత్ లక్ష్మా నాయక్, సుంకరి ప్రవీణ్, క్రాంతికుమార్, రాఘవ, రఫిక్, రాకేశ్‌రెడ్డి, శేషుపాల్‌రెడ్డి, రాజ్‌కుమార్‌నాయక్, రమేశ్, శ్రీను, మాజీ సర్పంచ్ యాదయ్య పాల్గొన్నారు.

కల్వకుర్తిలో 83.26 శాతం పోలింగ్

- మొత్తం ఓటర్లు 2,41,762
- ఓటేసిన 2,01,285 మంది
- స్ట్రాంగ్ రూమ్‌లకు ఈవీఎంల తరలింపు
- కల్వకుర్తి ఎన్నికల అధికారి శ్రీను



శ్రీను, కల్వకుర్తి ఎన్నికల అధికారి

ఆమనగల్లు: కల్వకుర్తి అసెంబ్లీ నియోజకవర్గంలో 83.26 శాతం పోలింగ్ నమోదైంది. కల్వకుర్తి అసెంబ్లీ నియోజక వర్గంలో 2,41,762 మంది ఓటర్లకు గాను 2,01,285 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. నియోజకవర్గ పరిధిలో కల్వకుర్తి, ఆమనగల్లు, చారకొండ, వెల్దండ, మాడ్గుల, తలకొండపల్లి, కడ్తాల మండలాల పరిధిలోని 262 పోలింగ్ బూత్‌లలో 83.26 శాతం పోలింగ్ నమోదైనట్లు కల్వకుర్తి ఎన్నికల అధికారి శ్రీను వెల్లడించారు. కల్వకుర్తి మండలం ఎంగంపల్లిలో అత్యధికంగా 92.57 శాతం ఓట్లు పోలయ్యాయని, ఎంగంపల్లిలో 996 మంది ఓటర్లకు గాను 922 మంది ఓటు వేశారని చెప్పారు. కల్వకుర్తి పట్టణంలోని 91వ నంబర్ పోలింగ్ బూత్‌లో అత్యల్పంగా 58.51 శాతం పోలింగ్ జరిగిందని, ఇక్కడ 646 ఓటర్లుంటే 378 మంది మాత్రమే ఓటు హక్కును వినియోగించుకున్నారని తెలిపారు. ఆమనగల్లు మండలంలో 31,184 ఓట్లకు గాను 25,987 మంది, కడ్తాలలో 33,895 ఓట్లకు గాను 29,321 మంది, మాడ్గులలో 43,879 ఓటర్లుంటే 36,116 మంది, తలకొండపల్లి మండలంలో 36,768 మంది ఓటర్లకు గాను 31,628 మంది, కల్వకుర్తి మండలంలో 55,845 మంది ఓటర్లకు గాను 45,190 మంది ఓటర్లు, వెల్దండ మండలంలో 33,051 మంది ఓటర్లకు గాను 28,353 మంది ఓటర్లు, చారకొండ మండలంలో 7,078 మంది ఓటర్లకు గాను 6,030 మంది ఓటర్లు ఓటు హక్కు వినియోగించుకున్నారని ఆయన చెప్పారు. పోలింగ్ అనంతరం ఈవీఎంలను కల్వకుర్తి నుంచి ఇబ్రహీంపట్నంలోని మంగళపల్లి సమీపంలోని సీవీఆర్ కళాశాలలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్‌కు తరలించామని శ్రీను తెలిపారు.

పంతునాయక్ సేవలు చిరస్మరణీయం

- పీసీసీ సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్



పంతూనాయక్ ఘాట్ వద్ద నివాళి అర్పిస్తున్న నాయకులు

కడ్తాల్: కాంగ్రెస్ నాయకుడు ఆమనగల్లు మాజీ ఎంపీపీ దివంగత రామవత్ పంతూనాయక్ ఈ ప్రాంత గిరిజనుల అభివృద్ధికి ఎంతో పాటు పడ్డారని పీసీసీ సభ్యుడు అయిళ్ల శ్రీనివాస్‌గౌడ్ కొనియాడారు. శుక్రవారం పంతూనాయక్ 16వ వర్ధంతిని పురస్కరించుకుని మండల పరిధిలోని మైసిగండి గ్రామంలో పంతూనాయక్ ఘాట్‌ను కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, కుటుంబ సభ్యులు సందర్శించి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ మైసిగండి ఆలయ అభివృద్ధికి పంతూనాయక్ ఎంతో కృషి చేశారని, ఆయన సేవలు చిరస్మరణీయమని ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో మైసిగండి ఆలయ వ్యవస్థాపకుడు శిరోలీపంతూనాయక్, తహసీల్దార్ జ్యోతి, ఎంపీపీ కమ్లీమోత్యానాయక్, సర్పంచ్ తులసీరాంనాయక్, ఎంపీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ, నాయకులు భాస్కర్‌నాయక్, అరుణ్‌కుమార్, పాండునాయక్, మాజీ సర్పంచ్ శేఖర్‌గౌడ్, పంతూనాయక్ కుటుంబ సభ్యులు, ఆలయ అర్చక సిబ్బంది పాల్గొన్నారు.

రిపేరు చేసిన నెలరోజులకే ఖరాబ్!



హయత్‌నగర్ పాతరోడ్డులో కుంగిన మ్యాన్‌హోల్

హయత్‌నగర్: హయత్‌నగర్ పాత రోడ్డులో డ్రైనేజీ ట్రంక్‌లైన్ మ్యాన్‌హోల్‌కు రిపేరు చేసిన నెల రోజులకే మరోసారి కుంగిపోయింది. దీంతో ప్రయాణికులకు మరోసారి ఇక్కట్లు తప్పడం లేదు... హయత్‌నగర్ నుంచి తొర్రూరు వైపు వెళ్లే పాతరోడ్డు గత సెప్టెంబర్‌లో కంగిపోయి నడిరోడ్డుపై పెద్ద గొయ్యి ఏర్పడింది. దీనికి మరమ్మతు చేసేందుకు సుమారు రెండు నెలలు పట్టింది. గొయ్యితో పాటుగా పక్కనే బలహీనంగా ఉన్న మ్యాన్‌హోళ్లను గుర్తించిన అధికారులు వాటికి కూడా మరమ్మతు చేశారు. ఈ రెండు నెలలూ వాహనదారులు, స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. మరమ్మతులు పూర్తైన నెలరోజుల్లోనే మరోసారి మ్యాన్‌హోల్ కుంగి పోయింది. అప్పుడే రిపేర్ చేసిన మ్యాన్‌హోల్ అంతలోనే కుంగిపోవడంపై స్థానికులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. నాసిరకం పనుల కారణంగానే మ్యాన్‌హోల్ కుంగిపోయిందని వెంటనే మరమ్మతులు చేయాలని వారు కోరుతున్నారు.

నువ్వా నేనా.. ఫలితంపై ఉత్కంఠ

- మహేశ్వరంలో త్రిముఖ పోటీ
- ఎవరు గెలిచినా స్వల్ప ఆధిక్యమే అంటున్న విశ్లేషకులు
- 55.33 శాతం ఓటింగ్ నమోదు
- రేపు తేలనున్న భవితవ్యం



పటోళ్ల సబితారెడ్డి బీఆర్ఎస్ అభ్యర్థి



అందెల శ్రీరాములు యాదవ్, బీజేపీ అభ్యర్థి



కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి కాంగ్రెస్ అభ్యర్థి

మహేశ్వరం: ఘాటైన విమర్శలు.. హోరెత్తించేలా ప్రచారాలు.. ఎవరికి వారే ఓటర్ల ప్రసన్నం కోసం అవస్థలు. ప్రస్తుతం వీటికి శుభం కార్డు పడింది. కచ్చితంగా తామే గెలుస్తామని ధీమాతో మహేశ్వరం నియోజకవర్గ ప్రధాన పార్టీల అభ్యర్థులు ఉన్నారు. తీర్పు ఎలా ఉండబోతుందో.. ప్రజలు ఎవరిని అసెంబ్లీకి పంపిస్తారో అనే ఉత్సుకత తీవ్రమైంది.

ఆ ముగ్గురిలోనే..

నియోజకవర్గంలో బీఆర్ఎస్, బీజేపీ, కాంగ్రెస్ పార్టీల అభ్యర్థులు పోటీ పడ్డారు. బీఆర్ఎస్ నుంచి విద్యాశాఖ మంత్రి సబితారెడ్డి, బీజేపీ నుంచి అందెల శ్రీరాములు యాదవ్, కాంగ్రెస్ నుంచి కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి బరిలో ఉన్నారు. గత 20 రోజుల నుంచి గ్రామాలు, డివిజన్లు, వార్డులు, బస్తీలలో హోరాహోరీ ప్రచారాలు నిర్వహించారు. గెలుపు కోసం ఎవరికి వారే లెక్కలేసుకుంటున్నారు. సబితారెడ్డి 2009, 2018లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా గెలుపొంది మంత్రిగా పని చేసి 2023లో బీఆర్ఎస్ అభ్యర్థిగా పోటీ చేశారు. బీజేపీ నుంచి అందెల శ్రీరాములు యాదవ్ 2018లో పోటీ చేసి సుమారు 40 వేల ఓట్లు సాధించి మూడో స్థానానికి పరిమితమయ్యారు. కాంగ్రెస్ పార్టీ నుంచి మాజీ ఎమ్మెల్యే కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి మహేశ్వరంలో తొలిసారిగా పోటీ చేశారు. మూడు పార్టీల అభ్యర్థులు గెలుపుపై ఎవరికి వారే ధీమాతో ఉన్నారు.

మందకొడిగా పోలింగ్..

నియోజకవర్గంలో పురుష ఓటర్లు 2,81,203, మహిళా ఓటర్లు 2,65,307 ట్రాన్స్‌జెండర్లు 67 మొత్తం ఓటర్ల సంఖ్య 5,46,577. 2018 అసెంబ్లీ ఎన్నికల్లో నియోజకవర్గంలో 55.09 శాతం ఓటింగ్ నమోదైంది. ఈసారి ఎన్నికల్లో మొత్తం 3,02,365 ఓట్లు పోలై 55.33 శాతం నమోదైంది. హైదరాబాద్‌కు అతిచేరువలో ఉండడం, కొంత భాగం పాతబస్తీలో కలవడం, మరికొంత గ్రామీణ ప్రాంతంలో ఉంటుంది. ఓటింగ్ శాతం తక్కువ నమోదు కావడంతో అభ్యర్థుల్లో ఆందోళన పెరిగిపోతుంది.

గెలుపుపై ధీమా

నియోజకవర్గంలో మూడు పార్టీల అభ్యర్థులు ఎవరికి వారు తామే గెలుస్తామని ధీమా వ్యక్తం చేస్తున్నారు. ప్రధానంగా బీఆర్ఎస్ పార్టీ నుంచి పోటీ చేసిన విద్యాశాఖ మంత్రి సబితారెడ్డి ఈ ఎన్నికల్లో తానే గెలుస్తానని నమ్మకం వ్యక్తం చేస్తున్నారు. నియోజకవర్గంలో వేల కోట్ల నిధులను తీసుకొచ్చి అభివృద్ధి పనులతో పాటు అర్హత కలిగిన ప్రతి ఒక్కరికి రాజకీయాలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందించామని మంత్రి అన్నారు. బీజేపీ నుంచి పోటీ చేసిన అందెల శ్రీరాములు యాదవ్ గత ఎన్నికల్లో ఓడిపోయిన సానుభూతి తనకు ఈసారి కలిసి వస్తుందన్నారు. కాంగ్రెస్ పార్టీ నుంచి పోటీ చేసిన కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి రాష్ట్రంలో హస్తం గాలి వీస్తుండడం, కేంద్రంలో బీజేపీ, రాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రభుత్వాలు చేస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలు తనకు కలిసివస్తుందని కేఎల్లార్ ధీమా వ్యక్తం చేస్తున్నారు. బీఎస్పీ నుంచి పోటీ చేసిన కొత్త మనోహర్‌రెడ్డి ఓట్లు చీల్చి ఎవరి గెలుపోటములకు కారణమవుతారో అని మూడు పార్టీల అభ్యర్థులు గుబులు పడుతున్నారు. ఆ సంగ్దిదం వీడాలంటే ఆదివారం సాయంత్రం వరకు ఆగాల్సిందే.

విద్యార్థులకు ప్రశంసలు



ప్రశంసా పత్రం అందుకుంటున్న విద్యార్థిని

బడంగ్‌పేట్: పల్లవి, ఆవేర్ ఇంటర్నేషనల్ స్కూల్ సరూర్‌నగర్ ఆధ్వర్యంలో 'రసాజ్ఞ ది నవరస–23' పేరుతో వార్షికోత్సవాలు నిర్వహించారు. టాలెంట్–21 సీఈవో గురిందర్‌పాల్‌సింగ్, డీపీఎస్, పల్లవి విద్యాసంస్థల సీఈవో మల్కా యశస్వీ, అకాడమిక్ డైరెక్టర్ సుధ తురగ, స్కూల్ డైరెక్టర్ అనితా రెడ్డి, ప్రిన్సిపాల్ చారుజైన్ వేడుకలు ప్రారంభించారు. నాటక, క్రీడలు, కరాటేలో ప్రతిభ కనపరిచిన విద్యార్థులను అభినందించి ప్రశంసా పత్రాలు అందచేశారు. విద్యార్థుల పాటలు, నాటక ప్రదర్శన ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో విద్యార్థుల తల్లి దండ్రులతో పాటు ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

కనీస వసతులు లేక అవస్థలు

- రోడ్లపై పారుతున్న మురుగు
- కంకర తేలిన రోడ్లు
- పట్టించుకోని అధికారులు



సాగర్ రహదారిపైనే పారుతున్న మురుగునీరు



సాగర్‌రహదారిపై బస్టాప్ దగ్గర కంకరతేలిన రోడ్డు



టీచర్స్‌కాలనీలో మరమ్మతుకు నోచుకోని మ్యాన్‌హోల్

హస్తినాపురం: ఎల్‌బీనగర్ నియోజకవర్గ పరిధిలోని వివిధ ప్రాంతాలలో కనీసవసతులు లేకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అటు విజయవాడ జాతీయ రహదారిపై, ఇటు నాగార్జున సాగర్ రహదారిపై డ్రైనేజీ పొంగిపొర్లుతూ ప్రతినిత్యం దుర్గంధం వెదజల్లుతున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యాడని ఆయాప్రాంతాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. విజయవాడ జాతీయరహదారిపై సుష్మా థియేటర్ చౌరస్తా దగ్గర, డీమార్ట్ ముందు ప్రతి నిత్యం ఉదయం 7 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు డ్రైనేజీ పొంగిపొర్లుతూ మురుగునీరు గత మూడునెలలుగా రోడ్డుపై పారుతోంది. మరోవైపు నాగర్జున సాగర్ రహదారిపై డ్రైనేజీ పొంగి మురుగునీరు పారుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని వాహనదారులు, స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.సాగర్‌రోడ్డు పక్కన ఉన్న పంచాయతీ రాజ్ టీచర్స్ కాలనీలో కనీస వసతులు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదు.బస్టాప్ ముందు రోడ్డుపై కంకర తేలి అధ్వానంగా మారి రాకపోకలకు ఇబ్బంది పడుతున్నామని మహిళలు, విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ప్రజలు ఎదుర్కొంటున్న మస్యలను తక్షణమే పరిష్కరించాలని ప్రజలు జీహెచ్ఎంసీ ఉన్నతాధికారులకు విజ్ఞప్తి చేస్తున్నారు.



టీచర్స్‌కాలనీలో రోడ్డు దుస్థితి

పట్నం బరిలో విజేతెవరో..!

- ఈవీఎంలలో భవితవ్యం
- ప్రధాన పార్టీల్లో ఉత్కంఠ
- 3న ఫలితాలు ఆందోళనలో అభ్యర్థులు



ఇబ్రహీంపట్నం మ్యాప్



బీఆర్ఎస్ అభ్యర్థి మంచిరెడ్డి కిషన్‌రెడ్డి



కాంగ్రెస్ అభ్యర్థి మల్‌రెడ్డి రంగారెడ్డి

ఇబ్రహీంపట్నం: చెదురుముదురు ఘటనలు మినహా శాసనసభ ఎన్నికలు పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. ఈవీఎంలలో నిక్షిప్తమైన 22,90 మంది అభ్యర్థుల భవితవ్యం ఈ నెల 3న తేలనుంది. ఆ రోజు ఉదయం 8 గంటలకు ఓట్ల లెక్కింపు ప్రారంభమవుతుంది. మధ్యాహ్నానికి గెలుపోటములపై స్పష్టత రానుంది. సాయంత్రానికి పూర్తి ఫలితాలు వెలువడే అవకాశం ఉంది. అయితే ప్రధానంగా బీఆర్ఎస్, కాంగ్రెస్ అభ్యర్థులు హోరాహోరీగా తలపడ్డారు. అందువల్ల ప్రజాతీర్పుపై అందరిలోని ఉత్కంఠ నెలకొంది. అయితే ఇబ్రహీంపట్నం నియోజకవర్గం నుంచి 28 మంది అభ్యర్థులు ఎన్నికల్లో తలపడ్డారు.

రేపే కౌంటింగ్

ఇబ్రహీంపట్నం నియోజకవర్గ ఓట్ల లెక్కింపు ఆదివారం మంగల్‌పల్లి సమీపంలోని సీవీఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో జరుగనుంది. ఇవీఎంలను అక్కడే భద్రపరిచారు. ఉదయం 8 గంటల నుంచి ఓట్ల లెక్కింపు ప్రక్రియ ప్రారంభవుతుంది. నియోజకవర్గంలో 3,27,583 ఓటర్లు ఉండగా 2,45,459 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. పురుషులు 1,23,968 మంది, మహిళలు 1,21,483 మంది, ట్రాన్స్ జెండర్స్ 8 మంది ఉన్నారు. 74.93 శాతం పోలింగ్ నమోదైంది. పోస్టల్ బ్యాలెట్ల ద్వారా 2,500 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారని అధికారులు చెబుతున్నారు. ముందుగా పోస్టల్ బ్యాలెట్ ఓట్లను కౌంటింగ్ చేయనున్నారు. అనంతరం 14 టేబుళ్లపై 25 రౌండ్లలో ఓట్లను లెక్కించనున్నారు. ఎలాంటి ఆటంకాలు జరుగకుండా అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు.

బీఆర్ఎస్, కాంగ్రెస్ మధ్య తీవ్ర పోటీ

బీఆర్ఎస్ అభ్యర్థి కిషన్‌రెడ్డి, కాంగ్రెస్ అభ్యర్థి రంగారెడ్డి నువ్వా నేనా అన్నట్లుగా పోటీలో తలపడ్డారు. ప్రచారంలో కూడా మిగతా అభ్యర్థుల కంటే ముందంజలో నిలిచారు. అదేవిధంగా బీజేపీ నుంచి దయానంద్‌గౌడ్, సీపీఎం నుంచి యాదయ్య, బీఎస్పీ అభ్యర్థి గొరిగే మల్లేశ్ పోటీలో ఉన్నారు.